## క్లుప్తంగా

### బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి

- తనిఖీ బృందాలకు పచ్చ జెండా ఊపిన కలెక్టర్ దినేష్‌కుమార్


పచ్చజెండా ఊపుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా అరికట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జూన్ 1 నుంచి 'యాక్షన్ మంత్ ఎగినెస్ట్ చైల్డ్ లేబర్' కార్యక్రమాన్ని నిర్వహించే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీమ్‌లను కలెక్టర్ ప్రకాశం భవనం వద్ద శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికులను ఏ పనిలో పెట్టుకున్నా ఆ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వారికి జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థపై ప్రజలు అవగాహన పెంచుకుని యంత్రాగానికి సహకరించాలని సూచించారు. దీనిలో జిల్లా కార్మిక కమిషనర్ శ్రీనివాస కుమార్, సహాయ కార్మిక కమిషనర్‌లు అనితావాణి, కోటేశ్వరరావు, పవన్‌కుమార్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, బాలల పరిరక్షణ అధికారి దినేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, దిశా సీఐ మల్లికార్జున్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నేడు వలంటీర్లకు వందనం

చీమకుర్తి: మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా శనివారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో సేవా పురస్కారాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది కాలంలో ప్రజలకు చేసిన సేవలను దృష్టిలో ఉంచుకొని నగదు పురస్కారాలతో వలంటీర్లను సత్కరిస్తారన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అర్బన్, రూరల్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

### ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం


ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: వెన్నుముక సమస్యతో ఉన్న ఆటో డ్రైవర్ నెహేమియాకు ఆపరేషన్ చేయడంతో రెండు కాళ్లు పనిచేయక నడవలేని పరిస్థితిలో మంచానికే పరిమితయ్యాడు. విషయం తెలుసుకున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు రూ.15వేలు అందించారు. ప్రవాస భారతీయుడు మిండి శ్రీనివాసరావు సహకారంతో శుక్రవారం అన్నవరప్పాడు కాలనీలో నివాసం ఉంటున్న నెహేమియాకు ట్రస్టు సెక్రటరీ షేక్ సర్దార్‌బాష అందించారు. బియ్యం, నిత్యావసరాలు కూడా అందిస్తామన్నారు. సభ్యులు మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, రాయపాటి జగదీష్ పాల్గొన్నారు.

#### ఆర్‌బీకేల ద్వారా ఎరువులు అందుబాటులో



బండ్లమూడి గ్రామానికి చెందిన యెన్నం శేషిరెడ్డి గతంలో వ్యవసాయం చేసే సమయంలో ఆయనకు కావాల్సిన ఎరువులను కొనుగోలు చేసేందుకు చీమకుర్తిలోని దుకాణాల చుట్టూ తిరిగేవాడు. ప్రస్తుతం ఆయన ఉండే బండ్లమూడి గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ఉండటంతో స్థానిక అధికారులను అడిగి ఆయన సాగు చేస్తున్న వరి, కంది, సజ్జ, శనగ, మిర్చి పంటలకు కావాల్సిన యూరియా, డీఏపీ, 20:20 ఎరువులను తెచ్చుకొని పంటలకు వేసుకున్నాడు. ఆయన ఉండే గ్రామంలోనే ఎరువులు దొరకటంతో మండల కేంద్రం చీమకుర్తి చుట్టూ తిరిగే పని తప్పిందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

#### అందుబాటులో వ్యవసాయ యంత్ర పరికరాలు



నాయుడుపాలెం గ్రామానికి చెందిన కూరాకుల రాఘవరెడ్డి కంది, వరి, శనగ పంటలు సాగు చేశాడు. ఆ పంటల సాగు సమయంలో పొలం దున్ని సాగు చేయటానికి కావాల్సిన నాగలి, గొర్రు, రోటావేటర్, పైపులు అన్ని కూడా ఆయన ఉండే స్వగ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో స్థానిక అధికారులను అడిగి తెచ్చుకొని వ్యవసాయం చేశాడు. వ్యవసాయంలో ఎప్పుడు ఏఏ యంత్ర పరికరాలు కావాలో వాటిని ఆర్‌బీకేల ద్వారా తెచ్చుకొని వ్యవసాయం చేయటం వలన వ్యవసాయ పనిముట్లకు ఇబ్బంది లేకుండా పోయింది.

# రైతుల కల్పవృక్షం.. ఆర్బీకే

- ఎరువులు, విత్తనాలు, పరికరాలు, ఈ క్రాప్ బుకింగ్, పరిహారం, మద్దతు ధర అన్నీ ఆర్‌బీకేల ద్వారానే
- చీమకుర్తి మండలంలో 18 ఆర్‌బీకేల ద్వారా 15 వేల మంది రైతులకు సేవలు

చీమకుర్తి: ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరిగి చివరకు వ్యవసాయం చేయలేమనే ఆవేదన వ్యక్తం చేసిన రోజుల నుంచి నేడు వ్యవసాయం అంటే పండుగ అనే పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. ప్రతి గ్రామంలో రైతులు ఉండే ఇళ్లకు సమీపంలోనే ప్రతి గ్రామానికి ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. దాని ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు కొనుగోళ్ల నుంచి రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే వరకు, వారికి కావాల్సిన ఎరువుల కొనుగోలు, వ్యవసాయానికి కావాల్సిన యంత్ర పరికరాలన్నీ ఆర్‌బీకేల దగ్గరే అందుబాటులో ఉన్నాయి. రైతులు పండించిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేసి ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు పరిహారం, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించటం, పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ, టోల్‌ఫ్రీ 155251 ద్వారా రైతులతో నేరుగా ముఖాముఖితో శాస్త్రవేత్తల సలహాలు అందించేందుకు ఆర్‌బీకేలు దోహదపడుతున్నాయి. భూసార పరీక్షలు, పురుగుమందులు, క్రిమిసంహారక మందులు అందించడంలో ఆర్‌బీకే రైతులకు కల్పవృక్షంలా పనిచేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చీమకుర్తి మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల ద్వారా మొత్తం 15 వేల మంది రైతులకు వ్యవసాయ సేవలను అందిస్తున్నారు.


పీ.నాయుడుపాలెంలోని రైతు భరోసా కేంద్రం

#### 15 వేల మంది రైతులకు సేవలు...



చీమకుర్తి మండలంలో మొత్తం 18 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా 15 వేల మంది రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను మండల వ్యవసాయాధికారులు, సహాయ సిబ్బంది ద్వారా అందిస్తున్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, యంత్రపరికరాలు రైతులు ఉండే స్వగ్రామాల్లోనే అందుబాటులో ఉంచారు. గతంలో మాదిరిగా రైతులు నెలల తరబడి మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా స్వగ్రామాల్లోనే వ్యవసాయానికి కావాల్సిన పనులన్నీ వారి ఇంటికి సమీపంలోనున్న ఆర్‌బీకేల ద్వారా పొందుతున్నారు.

– డీవీ భాస్కర్, మండల వ్యవసాయాధికారి, చీమకుర్తి.

#### ఈ క్రాప్ బుకింగ్‌తో సాగు చేసిన పంటకు భరోసా



ఎర్రగుడిపాడు గ్రామానికి చెందిన గంగిరేకుల వెంకట్రావు తన గ్రామంలో వరి పంట సాగు చేశాడు. వర్షాలు, కరువు కాటకాల వలన ఆయన సాగు చేసిన పంట నష్టపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా రైతు భరోసా కేంద్రంలోకి వెళ్లి వరి పంటకు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్నాడు. ఆయన సాగు చేసిన పంట నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందనే నమ్మకం, భరోసాని రైతు భరోసా కేంద్రం కల్పించింది.


కూనంనేనివారిపాలెం ఆర్‌బీకేలో ఎరువులను తీసుకుంటున్న రైతులు

### గృహ ఆస్తి ఏర్పాటు సీఎం జగన్‌కే సాధ్యం


అవగాన కల్పిస్తున్న ఈఈ శ్రీనివాస్ ప్రసాద్

ఈతముక్కల (కొత్తపట్నం): లబ్ధిదారులకు గృహ ఆస్తిని సమకూర్చి కుటుంబానికి మనోధైర్యం తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెరుగు శ్రీనివాస ప్రసాద్ కొనియాడారు. మండలంలో ఈతముక్కలలో హౌసింగ్ డే సందర్భంగా లేఅవుట్లను పరిశీలించి లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు ఉండాలని జగనన్న కాలనీలు పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇళ్లు కూడా నిర్మించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా రూ.1.80 లక్షలు ఇవ్వటమే కాక డ్వాక్రా గ్రూపుల నుంచి రూ. 35 వేలు లోను రూపంలో ఇస్తారన్నారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ 142 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వటానికి రూ.30 లక్షలతో భూమిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు.

### విద్యుత్ మరమ్మతులు పూర్తి

ఒంగోలు రూరల్: పలు గ్రామాల్లో ఏర్పడిన గాలి వాన బీభత్సానికి నేలకొరిగిన స్తంభాలు, కండెన్సర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు రూరల్ ఏఈ ఆర్‌ఆర్.చెన్నారెడ్డి తెలిపారు. కరవది, త్రోవగుంట, ముక్తినూతలపాడు, గుడిమెళ్ళపాడు, గుత్తికొండివారిపాలెం, కొప్పోలు, కొప్పోలు కాలనీల్లో మరమ్మతులు పూర్తయినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు చెప్పారు. గాలివానకు అనేక స్తంభాలు, వైర్లు తెగిపోయినట్లు, కండెన్సర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. ఒంగోలు డీఈ, ఏడీ ఆదేవాలమేరకు సిబ్బంది గత గురువారం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు సహాయసహకారాలు అందించినట్లు తెలిపారు.

## గడప గడప కార్యక్రమాన్ని సత్వరమే పూర్తి చేద్దాం


జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టాల్సిన సచివాలయాల్లో సత్వరమే పూర్తి చేసేందుకు వేగవంతం చేద్దామని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు పార్టీ నాయకులతో శుక్రవారం సమీక్షించారు. ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులతో చర్చించారు. జూన్, జూలై నెలల్లో మిగిలిన సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని నాయకులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈనెల 4వ తేదీన మద్దిపాడులో నియోజకవర్గ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహించే జాబ్‌మేళాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

## పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్, నగర కమిషనర్


గృహాలను పరిశీలిస్తున్న నగర కమిషనర్, ఎంపీడీవో

ఒంగోలు రూరల్: పేదలకు స్థలాలతో పాటు గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్, నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కరవది సచివాలయ హౌసింగ్ లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడారు. 14 సచివాలయాల్లో భూసేకరణ నిర్వహించి రోడ్లు, మంచినీటి వసతి, లేఅవుట్ మెరక తోలడం, విద్యుత్ సదుపాయాలు కల్పించింటామన్నారు. 1028 మందికి గృహాలు మంజూరైనా ఇంకా ప్రారంభించలేదన్నారు. ఓఎస్‌ఆర్ కన్‌స్ట్రెక్షన్స్ ఆధ్వర్యంలో చేపట్టారన్నారు. సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ కాంట్రాక్టర్‌ను గుర్తిస్తే నిర్మాణాలు పూర్తి చేస్తారని తెలిపారు. హౌసింగ్ ఏఈ పృథ్వీ మాట్లాడుతూ 340 చదరపు అడుగుల్లో బెడ్‌రూం, కిచెన్, పోర్టుకో నిర్మాణం జరుగుతోందన్నారు. ఏపీఎం మాట్లాడుతూ ఇళ్ల పట్టాలను పొందిన మహిళలను వెంటనే గ్రూపుల్లో చేర్చాల్సిందిగా ఏపీఎం డీపీవోలను ఆదేశించారు. అనంతరం నిర్మాణాలను పరిశీలించారు. సీసీ చెంచులక్ష్మి, గ్రామ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఓఎస్‌ఆర్ కాంట్రాక్టర్ శేషారావు, సచివాలయ ఇంజనీర్స్ మణికంఠా, రమీజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

## రికార్డులు కచ్చితంగా నిర్వహించాలి

ఒంగోలు సబర్బన్: వార్డు సచివాలయాల్లో రికార్డులు కచ్చితంగా నిర్వహించాల్సిందేనని సిబ్బందిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని క్రిస్టియన్ పాలెం సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కొన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాం ధరించాల్సిందేనని ఆదేశించారు. ధరించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే, పీఎంజేఏవై సర్వే గురించి చర్చించారు. వీటిపై కలెక్టర్ ప్రతివారం సమీక్ష నిర్వహిస్తున్నారని వెల్లడించారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వేలకు వలంటీర్లు తప్పకుండా సహకరించాలని ఆదేశించారు. శానిటేషన్ విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, క్లాప్ యూజర్ ఫీజులు వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు.


పర్యావరణంపై ప్రదర్శనలో పాల్గొన్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు

#### మిషన్ లైఫ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మిషన్ లైఫ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కమిషనర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 60 అడుగుల రోడ్డులో ర్యాలీతో పాటు పోతురాజు కాలువ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్–జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. 49వ డివిజన్ కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు వేమూరి మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అంకితభావంతో పనిచేయండి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అజిత

ఒంగోలు రూరల్: నవరత్నాల్లోని పథకాలు పారదర్శకంగా, నేరుగా ప్రజలకు కేవలం అర్హులైన వారికే లబ్ధి చేకూరాలని ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారని ఒంగోలు ఎంపీడీవో పి.అజితా అన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు కరవది గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. బాధ్యత కలిగి ఒంగోలు మండల సచివాలయ సిబ్బంది ప్రభుత్వం తమపై ఉంచిన గురుతర బాధ్యతలను నెరవేర్చాలన్నారు. కార్యదర్శి శ్రీలక్ష్మి, రేణుక, కాంతారావు, వెంకటాద్రి, శివలీల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

## పది సప్లిమెంటరీ పరీక్షలకు 399 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం జిల్లాలోని 44 సెంటర్లలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 2417 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2018 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాల, సెయింట్ థెరెస్సా సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 12 పరీక్ష కేంద్రాలను నాలుగు స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డీఈవో పి.రమేష్ తెలిపారు.

### పోలేరమ్మకు పొంగళ్లు

చీమకుర్తి: సంతనూతలపాడులోని వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో కొండపాటి పోలేరమ్మ ఆలయ 13వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, సిండికేట్ సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డితో పాటు స్థానిక నాయకులు పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.


పూజలు చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

## ఘనంగా వెంకటేశ్వర కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కలెక్టర్ దినేష్ కుమార్‌ను సత్కరిస్తున్న వేదపండితులు

- పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: నగరంలోని కుర్తాళం సిద్ధేశ్వర స్వామి పీఠపాలిత శ్రీగిరి శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. పరాంకుశం సీతారామాచార్యులు బృందం శుక్రవారం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ట్రైనీ ఐఏఎస్ అధికారి శౌర్య పటేల్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఆటూరు వెంకట రమణారావు, అర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్యనిర్వాహణ ధర్మకర్త సి.వి రామకృష్ణారావు, జై.శంకర్, కలెక్టర్ దినేష్ కుమార్, ట్రైనీ ఐఏఎస్ శౌర్య పటేల్‌లను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవారి తిరువీధి ఉత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మే నెల 29న త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమైన శ్రీగిరి శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.

### 'పర్యావరణ హిత నడక' కరపత్రం ఆవిష్కరణ

ఒంగోలు అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో జూన్ 5వ తేదీ వాలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ హిత నడక కరపత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ప్రకాశం భవనంలో ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న గ్రీన్ వాక్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఆర్గనైజేషన్ చైర్మన్ వీరభద్రాచారి మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం రోజు సీవీఎన్ రీడింగ్ రూము నుంచి కలెక్టరేట్ వరకు గ్రీన్‌వాక్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో ట్రైనీ ఐఏఎస్ పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

### అంబేడ్కర్ ఆడిటోరియానికి భూమి పూజ

ఒంగోలు సబర్బన్: నగర పరిధిలోని 10వ డివిజన్ కొప్పోలులో శుక్రవారం అంబేడ్కర్ ఆడిటోరియానికి నగర మేయర్ గంగాడ సుజాత శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ ఆడిటోరియానికి రూ. 92 లక్షలు మంజూరు చేశామన్నారు. అందులో భాగంగా మొదటి విడతగా రూ. 40 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ బెంగుళూరు నర్సయ్య, 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం, కె.మాల్యాద్రి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

### ఆరోగ్య కేంద్రాల్లో వసతులు ఉండాలి


ఎంపీపీతో చర్చిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన వసతులు ఉండాలని మండల పరిషత్ అధ్యక్షులు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైద్యులు ఓనారియేల్, కులదీప్, ప్రసన్న, సువర్ణరాజు సిబ్బంది ఉన్నారు.